సాక్షి
యాదాద్రి భువనగిరి

బుధవారం । 2 । అక్టోబర్ । 2024



వేధింపులు తాళలేకనే హత్య

వేధింపులు తాళలేకనే భార్య తన తరుపు కుటుంబ సభ్యులతో కలిసి భర్తను దారుణంగా హత్య చేశారు. - 10లో



జిల్లాకు ఎన్నికల విధుల డైరీలు

స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి సిబ్బంది విధులు రూపొందించిన డైరీలు జిల్లాకు చేరుకున్నాయి. - 11లో



నిధులున్నా.. పనులు సున్నా

ఆత్మకూరు(ఎం) మండలంలోని తొమ్మిది గ్రామాల్లో నూతన పంచాయతీ భవన నిర్మాణాలు నేటికీ మొదలు పెట్టలేదు. - 11లో

న్యూస్‌రీల్

ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారిగా అనితారామచంద్రన్



నల్లగొండ: రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి 10 జిల్లాలకు ఐఏఎస్ అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. అందులో భాగంగా నల్లగొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాలకు ప్రత్యేక అధికారిగా పంచాయతీ రాజ్ కమిషనర్ అనితా రామచంద్రన్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈమె ప్రభుత్వం నిర్వహించే వివిధ కార్యక్రమాలకు ప్రత్యేక అధికారిగా వ్యవహరించనున్నారు.

నేడు కలెక్టరేట్‌లో గాంధీ జయంతి

భువనగిరిటౌన్: కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం మహాత్మా గాంధీ జయంతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ హనుమంతు కె.జెండగే మంగళవారం తెలిపారు. కార్యక్రమానికి అధికారులందరూ హాజరుకావాలని కోరారు.

రేపు ఇందిరా పార్క్ వద్ద 'రీజినల్' బాధితుల ధర్నా

చౌటుప్పల్ రూరల్: చౌటుప్పల్ ప్రాంతంలో రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని రైతులు కొంతకాలంగా డిమాండ్ చేస్తూ వస్తున్నారు. ఈమేరకు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలను కలిసి తమ గోడును వెల్లబోసుకున్నారు. ఫలితం లేకపోవడంతో చౌటుప్పల్ నుంచి ఉత్తర, దక్షిణ భాగం వైపు ఉన్న బాధిత రైతులు, ప్లాట్లు, ఇళ్లు కోల్పోతున్న వారు తమ కుటుంబాలతో కలిసి గురువారం హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద ధర్నా నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు.

యాదాద్రిలో సంప్రదాయ పూజలు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో మంగళవారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. క్షేత్రపాలకుడైన శ్రీఆంజనేయస్వామికి, ప్రధానాలయంతోపాటు విష్ణు పుష్కరిణి వద్ద, పాతగుట్ట ఆలయంలో ఆంజనేయస్వామిని సింధూరం, పాలతో అభిషేకించారు. తమలపాకులతో అర్చించారు. హనుమంతుడికి నైవేద్యం సమర్పించి, భక్తులకు ప్రసాదంగా అందజేశారు. ఇక ప్రధానాలయంలో నిత్య పూజలు సంప్రదాయంగా కొనసాగించారు. శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం నిర్వహించారు. సాయంత్రం వెండి జోడు సేవ పూజలు కొనసాగాయి.

నీటి సరఫరా సహాయకులకు శిక్షణ



మాట్లాడుతున్న డీఈ రాజయ్య

మోత్కూరు: గ్రామాల్లో గ్రామీణ నీటి సరఫరా విభాగంలో పని చేసే మంచి నీటి సరఫరా సహాయకులు నిరంతరం అప్రమత్తంగా వ్యవహరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ పద్మావతి అన్నారు. మంగళవారం మోత్కూరు మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ మంచి నీటి సరఫరా సహాయకులకు శిక్షణ శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రాజయ్య, భువనగిరి డీఎల్పీఓ శ్రీకాంత్ రెడ్డి, ఎంపీడీఓలు ఎండీ నిరంజన్‌వలీ, శంకరయ్య, ఎంపీఓలు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఎంజీయూకు దసరా సెలవులు

నల్లగొండ రూరల్: ఎంజీ యూనివర్సిటీకి ఈ నెల 3 నుంచి 13వ తేదీ వరకు దసరా సెలవులు ప్రకటించారు. ఈ నెల 14న తరగతులు పునఃప్రారంభం అవుతాయని రిజిస్ట్రార్ రవి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

3న వర్క్‌షాప్

ఎంజీ యూనివర్సిటీలో గురువారం విద్య, పరిశోధనల ప్రమాణాలు పెంపొందించేందుకు సెంటర్ ఫర్ రివర్స్ ఇన్ స్కీమ్స్ అండ్ పాలసీస్ న్యూఢిల్లీ ఆధ్వర్యంలో వర్క్ షాప్ నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ రవి మంగళవారం తెలిపారు. అధ్యాపకులు, యూనివర్సిటీ అనుబంధ కళాశాలల ప్రిన్సిపాల్స్ విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.



హాస్టల్ నుంచి సొంతూళ్లకు వెళ్తున్న విద్యార్థులు



భువనగిరి బస్టాండ్‌లో బస్సు ఎక్కేందుకు ఎగబడుతున్న విద్యార్థులు, ప్రయాణికులు

సొంతూళ్లకు పయనం

పాఠశాలలకు బుధవారం నుంచి 14వ తేదీ వరకు బతుకమ్మ, దసరా సెలవులు ఇచ్చారు. దీంతో ప్రభుత్వ, ప్రైవేట్ హాస్టళ్లలో ఉండే విద్యార్థులు ఇంటి బాటపట్టారు. అదేవిధంగా బుధవారం ఎంగిలిపువ్వు బతుకమ్మ కావడంతో ఆడపడుచులు తమ తల్లిగారింటికి వెళ్లేందుకు పయనమయ్యారు. దీంతో మంగళవారం భువనగిరి బస్టాండ్‌లో రద్దీ నెలకొంది. - భువనగిరి



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు తాళ్ల ఉప్పల్ రెడ్డి. యాదగిరిగుట్ట పాత గుండ్లపల్లి గ్రామం. రూ.1.60 లక్షల పంట రుణం తీసుకున్నాడు. కానీ మాఫీ కాలేదు. సదరు రైతు వ్యవసాయ కార్యాలయాన్ని సంప్రదించగా వారు పరిశీలించి ఆధార్ కార్డులో ఉన్న పేరు, బ్యాంకులో ఉన్న పేరు ఒకటిగా లేదని చెప్పారు. మరోసారి దరఖాస్తును ఉన్నతాధికారులకు పంపుతున్నామని రైతుతో తెలిపారు.



రాజాపేట మండలంలోని పాముకుంటకు చెందిన ఎండీ మైనోద్దిన్ రూ.70 వేల పంట రుణం పొందాడు. ప్రస్తుతం వడ్డీతో కలిపి రూ.99 వేలు చెల్లించాల్సి ఉంది. అతడి అన్న ఎండీ మహబూబ్ రూ.16వేల రుణం తీసుకున్నాడు. ఈక్రమంలో మైనోద్దిన్ ఆధార్ కార్డు నంబర్ మహబూబ్ ఫోన్ నంబర్‌కు లింకు ఉంది. దీంతో బ్యాంకులో ఒకే కుటుంబానికి చెందిన వారిగా చూపిస్తూ రుణమాఫీ ఏ ఒక్కరికి వర్తించడం లేదు. రుణమాఫీ కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నారు.

రుణం తీరలే!

- పూర్తిస్థాయిలో అందని పంట రుణమాఫీ
- ఎదురుచూపుల్లో 17,056 మంది రైతులు
- సాంకేతిక సమస్యలతో నిలిచిపోయిన 708 మంది రైతుల రుణమాఫీ
- ఇంకా కొన్ని కుటుంబాలకు కాని క్రాప్‌లోన్ ఫ్యామిలీ గ్రూపింగ్



సాక్షి,యాదాద్రి: రైతులు రూ. 2 లక్షల లోపు రుణమాఫీ కోసం ఎదురు చూస్తున్నారు. మూడు విడతల్లో రుణమాఫీ చేసినప్పటికీ మాఫీ కాని రైతులు ఇంకా ఉన్నారు. వారంతా పోరుబాట పట్టడంతో ప్రభుత్వం క్రాప్ లోన్ ఫ్యామిలీ గ్రూపింగ్‌కు ఆదేశాలు జారీ చేసింది. ఈమేరకు మండలాల వారీగా వ్యవసాయ అధికారులు రుణమాఫీ కాని రైతులను రైతు వేదికల వద్దకు పిలిపించి ఫ్యామిలీ గ్రూపింగ్ ప్రక్రియను పూర్తి చేశారు. ఇప్పటివరకు 17,056 కుటుంబాల గ్రూపింగ్ పూర్తయింది. అయితే కొంతమంది రైతుల ఫ్యామిలీ గ్రూపింగ్ ఇంకా పూర్తి కాలేదు. ఇందులో స్థానికంగా లేకపోవడం, ఎన్ఆర్ఐలు, పాస్‌బుక్‌లు రాని వారు ఉన్నారు. అయితే వీరికి మాఫీ ఎప్పుడు చేస్తారనేది ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. దీంతోపాటు మరో 31 రకాల సాంకేతిక సమస్యలతో రుణమాఫీ నిలిచిపోయిన 708 మంది రైతుల వివరాలను సేకరించారు. వీరంతా రుణమాఫీ కోసం ఎదురు చూస్తున్నారు.

రుణమాఫీ అయిన రైతుల వివరాలు

మొదటి విడత	36,483 మంది	రూ. 199.87 కోట్లు
రెండో విడత	17,991 మంది	రూ. 176.12 కోట్లు
మూడో విడత	9,995 మంది	రూ.164.66 కోట్లు

మిగిలిన వాటిపైనా అస్పష్టత

ఆధార్‌లో అచ్చుతప్పులు, ఆధార్‌కు, పట్టాదారు పాస్ పుస్తకానికి, బ్యాంకు ఖాతా నంబర్, ఆధార్ నంబర్ మధ్య తేడా, ఆధార్‌తో బ్యాంకు లింకేజీ లేకపోవడం వంటి సాంకేతిక సమస్యలతో రుణమాఫీ కాలేదు. ఈ విషయాన్ని గుర్తించిన వ్యవసాయశాఖ గతంలోనే ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. ఈ పరిస్థితుల్లో రేషన్‌కార్డు సంబంధిత సమస్యలపై గ్రూపింగ్ పూర్తి చేసిన ప్రభుత్వం మిగిలిన సమస్యలతో రుణమాఫీ పొందని వారి వివరాలను సేకరించింది. ఇలాంటి రైతుల్లో అయోమయం నెలకొంది.

అధికారుల చుట్టూ తిరుగుతున్నా



నేను రూ.70 వేల పంట రుణం తీసుకున్నా. ప్రతి సంవత్సరం ధాన్యం అమ్మగా వచ్చిన డబ్బులతో అసలు, వడ్డీ కలిపి చెల్లిస్తున్నా. చివరగా గత సంవత్సరం కూడా రుణం తీసుకున్నా. రూ.లక్ష లోపు రుణమున్నా మొదటి విడతలో రుణమాఫీ కాలేదు. ఆఫీసుల చుట్టూ తిరిగినా ఫలితం లేదు. ఇటీవల అధికారులకు దరఖాస్తు చేసుకున్నా. జాబితాను ప్రభుత్వానికి పంపించామని చెబుతున్నారు.

– గుండ్ల సుదర్శన్, ముక్తాపూర్

రుణమాఫీ కాలేదు



నేను మూడు ఎకరాల వరి పొలానికి గాను రూ.లక్ష 20 వేల పంట రుణం తీసుకున్నా. పంట రుణమాఫీ కోసం దరఖాస్తు కూడా పలుమార్లు చేసుకున్నా. అయినా నేటికీ రుణమాఫీ కాలేదు.

– గొగ్గలపల్లి సంజీవరెడ్డి, బట్టుగూడెం

వృద్ధుల సంక్షేమానికి అనేక చట్టాలు



మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే

- కలెక్టర్ హనుమంతు కె.జెండగే

సాక్షియాదాద్రి: వృద్ధుల సంక్షేమానికి అనేక చట్టాలు వచ్చాయని, వారికి అవగాహన కల్పించి న్యాయం చేస్తామని కలెక్టర్ హనుమంతు కె.జెండగే అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం కలెక్టరేట్‌లో వయో వృద్ధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వృద్ధాప్యంలో తల్లిదండ్రుల చూసే బాధ్యత పిల్లలపై ఉందన్నారు. పిల్లలు చూడకపోతే తల్లిదండ్రులు మెయింటెనెన్స్ కింద ట్రిబ్యునల్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. సీనియర్ సిటిజన్ సంరక్షణ చట్టం 2007 ప్రకారం ఆర్థికంగా, శారీరకంగా, ఆరోగ్యం పరంగా పర్యవేక్షించాల్సిన బాధ్యత పిల్లలపై ఉందన్నారు. విలువలతో కూడిన సంస్కృతి, సంప్రదాయాలు పిల్లలకు నేర్పించాలని చెప్పారు. వయో వృద్ధులకు సంబంధించి ప్రతి సమస్యను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ గంగాధర్ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆస్తి రాసిచ్చేటప్పుడు జాగ్రత్త వహించాలని సూచించారు. వయో వృద్ధులు ఇబ్బందులకు గురైతే అప్పీల్ చేయాలని, ఈ చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్ అసోసియేషన్ సభ్యులను కలెక్టర్ సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి నరసింహరావు, యాదగిరిగుట్ట ఏసీపీ రమేష్, డీఎంహెచ్ఓ యశోద, భువనగిరి ఆర్డీఓ అమరేందర్, చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్ రెడ్డి, సీనియర్ సిటిజన్ అసోసియేషన్ సభ్యులు బాలేశ్వర్, పోలి శంకర్‌రెడ్డి, రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్ రెడ్డి, బాలరాజు, సూపరింటెండెంట్ శశికళ, సీడీపీఓలు స్వరాజ్యం, శైలజ, జ్యోత్స్న, రమ, సమీరా మీర్జా, జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్యామిలీ డిజిటల్ కార్డుల సర్వేపై వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్లు

సాక్షి,యాదాద్రి: ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీకి గురువారం నుంచి సర్వే చేపట్టనున్న నేపథ్యంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మంగళవారం ఆయా జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టరేట్ నుంచి కలెక్టర్ హనుమంతు కె.జండగే, అదనపు కలెక్టర్లు గంగాధర్, బెన్ షాలోమ్, జిల్లా రెవెన్యూ అధికారులు అమరేందర్, శేఖర్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి సునంద పాల్గొన్నారు.

అభ్యర్థులకు అందని సమాచారం

- మొదటి రోజు జరగని డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన
- నేడు యథావిధిగా షెడ్యూల్

భువనగిరి: భువనగిరి పట్టణంలోని డీఎస్సీ–2024 అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ తొలిరోజు ప్రారంభం కాలేదు. సోమవారం ఫలితాలు ప్రకటించి మంగళవారం నుంచే అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈమేరకు విద్యాశాఖ అధికారులు స్థానిక వెన్నెల కళాశాలలో 15 కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఒక్కో కౌంటర్‌లో ఇద్దరు హెచ్ఎంలు, ఒక అసిస్టెంట్‌ను సిద్ధం చేశారు. సర్టిఫికెట్లు పరిశీలించే వారికి అధికారులు సూచనలు సైతం చేశారు. ఫలితాలు వెల్లడి అనంతరం అభ్యర్థుల ఫోన్‌కు ఎస్ఎంఎస్ గాని, జీ మెయిల్‌కు గాని సమాచారం ఇస్తామని ఉన్నత అధికారులు ప్రకటించారు. ఒక్కో పోస్టుకు ముగ్గురు చొప్పున మొత్తం 831 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉంది. అయితే సమాచారం రాకపోవడంతో సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు అభ్యర్థులు హాజరు కాలేదు. బుధవారం సెలవు రోజు అయినప్పటికీ ప్రభుత్వం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం సర్టిఫికెట్ల పరిశీలన కోసం సిబ్బంది సిద్ధంగా ఉంటారని డీఈఓ సత్యనారాయణ మంగళవారం తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్య జీవనం



కోర్టు ఆవరణలో శ్రమదానం చేస్తున్న జడ్జీలు ప్రదీప్, చందన

రామన్నపేట: వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనం సాగించవచ్చని రామన్నపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రదీప్, అదనపు కోర్టు జడ్జి చందన తెలిపారు. మంగళవారం స్వచ్ఛతాహీ సేవాలో భాగంగా న్యాయవాదులు, కోర్టు ఉద్యోగులతో కలిసి వారు శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రత కాపాడడం, చెట్లు పెంచడాన్ని పౌరులు సామాజిక బాధ్యతగా భావించాలని చెప్పారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంఏ మజీద్, కోర్టు సూపరింటెండెంట్లు నారగోని గంగాభవాని, బాలగోని శివరాజు, న్యాయవాదులు ఉయ్యాల హనుమంత్‌గౌడ్, లింగయ్య, మొగులయ్య, వెంకట్‌రెడ్డి, శ్రవన్‌కుమార్, డేవిడ్, యాదయ్య, దినేష్, స్వామి, అజీజ్, మన్నన్ పాల్గొన్నారు.

గౌరిచెన్ పర్వతాన్ని అధిరోహించిన అన్విత



గౌరిచెన్ పర్వతాన్ని అధిరోహించిన అన్వితారెడ్డి

భువనగిరి : భువనగిరి పట్టణానికి చెందిన పర్వతారోహకురాలు పడమటి అన్వితారెడ్డి పర్వతారోహణలో మరో రికార్డు సాధించారు. భారత్‌కు చెందిన 38 మంది సైన్యంతో కలిసి అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రం తవాంగ్ జిల్లాలోని 6,488 మీటర్ల ఎత్తులో ఉన్న గౌరిచెన్ పర్వతాన్ని అధిరోహించారు. తూర్పు హిమాలయాలలో మంచుతో నిండిన గౌరిచెన్ పర్వతం వెనకాల చైనా దేశం సరిహద్దు ప్రారంభం అవుతుంది. అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రంలోని డిరాంగ్‌ని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మౌంటరింగ్ అండ్ అడ్వెంచర్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో 30 మంది భారత్ సైన్యంతో పాటు భువనగిరిలో ఉన్న ట్రాన్సెండ్ అడ్వెంచర్ రాక్ క్లైంబింగ్ అకాడమికి చెందిన 8 మంది సభ్యులు సెప్టెంబర్ 1న గౌరిచెన్ పర్వతారోహణను ప్రారంభించి 22వ తేదీన పర్వత శిఖరానికి చేరుకున్నారు. మైనస్ 15 డిగ్రీల శీతల వాతావరణంలో పర్వతారోహణ కొనసాగినట్లు అన్వితారెడ్డి చెప్పారు. పర్వతారోహణ ముగించుకుని అన్వితారెడ్డి మంగళవారం భువనగిరికి చేరుకున్నారు. అన్వితారెడ్డి ఇప్పటికే పలు ఎత్తయిన పర్వతాలను అధిరోహించారు. ఎవరెస్టు పర్వతం, కిలిమంజారో, ఎల్‌బ్రోస్, విన్‌సెన్ పర్వతాలను అధిరోహించిన ఆమె.. మరికొన్ని పర్వతాలను అధిరోహించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు చెప్పారు.

వ్యాధుల నివారణపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న ఏడీపీహెచ్ఓ డాక్టర్ మనోహర్

చౌటుప్పల్: వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఏడీపీహెచ్ఓ డాక్టర్ మనోహర్ సూచించారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలన్నారు. వ్యాధులకు సరైన సమయంలో చికిత్స అందించాలన్నారు. కార్యక్రమంలో పీఓఎన్‌సీడీ డాక్టర్ సుమన్‌కళ్యాణ్, వైద్యులు పాల్గొన్నారు.

పంటల సాగుపై శిక్షణ

భువనగిరి రూరల్: భువనగిరి మండలంలోని కూనూరు గ్రామంలో మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం, వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో పత్తిలో గులాబీ రంగు కాయతొలుచు పురుగు, కాయ కుళ్లు తెగులు యాజమాన్యంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు అధిక దిగుబడికి పాటించాల్సిన మెళకువలను ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త అనిల్ కుమార్ వివరించారు. పత్తిలో మెగ్నీషియం లోపం, పూత పిందె రాలటం వంటి సమస్యలపై శాస్త్రవేత్త మమత పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు సాయి నిఖిత, ఇంద్రాణి, సింధూజ, మహేశ్వరి, గ్రామ అభ్యుదయ రైతులు శివానంద్, అరులయ్య, జయరాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

- బతుకమ్మ సంబరం



చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం ట్రినిటీ హైస్కూల్ ఆధ్వర్యంలో ముందస్తుగా నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో విద్యార్థినులు - చౌటుప్పల్

బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో - వివరాలు 10లో

పత్తి కొనుగోళ్లు ఇంకెప్పుడు?

- ప్రారంభం కాని సీసీఐ కేంద్రాలు
- దళారులను ఆశ్రయిస్తున్న రైతులు
- సిండికేట్‌గా మారి తక్కువ ధరకు కొంటున్న వ్యాపారులు



సంస్థాన్ నారాయణపురంలో పత్తి కొనుగోలు చేస్తున్న వ్యాపారులు

సంస్థాన్ నారాయణపురం: రైతులకు కష్టాలు తప్పడం లేదు. సీసీఐ కేంద్రాలు ప్రారంభం కాకపోవడం, పెట్టుబడులు, దసరా పండుగ ఖర్చుల కోసం పత్తి అమ్మేందుకు దళారులను ఆశ్రయిస్తున్నారు. దీనిని ఆసరాగా చేసుకున్న వ్యాపారులు సిండికేట్‌గా మారి ఒక ధర నిర్ణయించుకొని కొనుగోలు చేస్తున్నారు. నాణ్యమైన పత్తి క్వింటాకు ప్రభుత్వ మద్దతు ధర రూ.7,521 ఉండగా దళారులు మాత్రం రూ.6,400 నుంచి 6,600లకు కొనుగోలు చేస్తున్నారు. అంతేకాకుండా ఇటీవల కురిసిన వర్షానికి పత్తి కొంత మేర తడిచింది. దీనిని సాకుగా చూపి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు.

కాంటా తూకాల్లో మోసాలు

పత్తి కొనుగోలు చేసే కొంత మంది దళారులు పత్తి కాంటా వేసే క్రమంలో తుకంలో మోసాలకు పాల్పడుతున్నారు. గతంలోనూ జిల్లాలో ఇలాంటి ఘటనలు చోటు చేసుకున్నాయి. కంప్యూటర్ కాంటాలు వాడాల్సి ఉన్నప్పటికీ పత్తి తూకం చేసే సౌకర్యం నిమిత్తం ఇప్పటికి గొలుసు కాంటాలను వినియోగిస్తున్నారు.

వేధిస్తున్న కూలీల కొరత

జిల్లా వ్యాప్తంగా 1,00,514 ఎకరాల్లో పత్తి సాగు చేయగా.. సుమారు 5.50లక్షల క్వింటాళ్ల పత్తి వచ్చే అవకాశం ఉంది. ఒకేసారి పత్తి తీత పనులు మొదలు కావడంతో ఎక్కువ ఎకరాల్లో సాగు చేసిన వారికి కూలీలు దొరక్క ఇబ్బందులు పడుతున్నారు. దీంతో స్థానికంగా కాకుండా ఇతర ప్రాంతాల నుంచి కూలీలను తీసుకువస్తున్నారు. వారికి రూ.400 కూలితోపాటు ఆటో చార్జీల నిమిత్తం రూ.50లు అదనంగా రైతులు చెల్లిస్తున్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి. స్థానిక వ్యాపారులు సిండికేట్‌గా మారి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. కాంటా తూకం చేసినప్పుడు అదనంగా కిలో పత్తి తీసుకోవడంతో పాటు ధరలు తగ్గితే కోతలు విధిస్తున్నారు. పెరిగిన పెట్టుబడి ఖర్చులు, దిగుబడి ఆధారంగా క్వింటాకు రూ.10వేలు ప్రకటించాలి.

– వాంకుడోతు రాజునాయక్, వాచ్యాతండా